TELANGANA CAPITAL
# తెలంగాణ క్యాపిటల్
నిజం.. నిజాయితీ.. నిబద్ధత
www.telanganacapitalnews.com
TELANGANA CAPITAL NEWS

హైదరాబాద్ | సంపుటి : 1 సంచిక: 105 | గురువారం, ఆగస్టు 15, 2024 | కంప్లిమెంటరీ కాపీ | పేజీలు : 4

## అరుదైన గౌరవంగా భావిస్తున్నా: మను బాకర్

న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించి చరిత్ర సృష్టించిన యువ షూటర్ మను బాకర్ విశ్వక్రీడల ముగింపు వేడుకల్లో భారత పతాకధారిగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. భారత హాకీ స్టార్ శ్రీజేశ్‌తో కలిసి మను బాకర్ ముగింపోత్సవంలో భారత్ పతాకధారిగా వ్యవహరించింది. దీనిపై తాజాగా మను బాకర్ స్పందించింది. ఒలింపిక్స్ వంటి మెగా క్రీడల్లో జాతీయ జెండాను చేతబూని ముందుకు సాగే అవకాశం రావడం చాలా గర్వంగా ఉందని పేర్కొంది. దీన్ని తన జీవితంలోనే అత్యంత అరుదైన గౌరవంగా అభివర్ణించింది. ఒలింపిక్స్‌లో పాల్గొన్న భారత అథ్లెట్లలో ఎంతో మంది తనకంటే మెరుగైన స్థితిలో ఉన్నారని, అయినా వారిని కాదని తనకు పతాకధారిగా ఛాన్స్ దక్కడం ఎంతో ఆనందం కలిగించిందని వివరించింది. ఇక పారిస్ ఒలింపిక్స్ తనకు చాలా ప్రత్యేకమని తెలిపింది. ఒలింపిక్స్ పతకాల కోసం తామంతా ఎంతో కష్టపడ్డామని, అయితే ఈ విషయంలో కొందరికి నిరాశే మిగలడం ఎంతో బాధించిందని మను బాకర్ ఆవేదన వ్యక్తం చేసింది. కాగా, తాను ఈ క్రీడల్లో రెండు పతకాలు గెలుచుకోవడం సంతోషంగా ఉందని, రానున్న క్రీడల్లో మరింత మెరుగైన ప్రదర్శన చేసేందుకు ఇది దోహదం చేస్తుందనే నమ్మకాన్ని మను వ్యక్తం చేసింది.



## ఫ్యూచర్ తెలంగాణ నినాదానికి మంచి రెస్పాన్స్ వచ్చింది: మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్: ఫ్యూచర్ తెలంగాణ నినాదానికి మంచి రెస్పాన్స్ వచ్చిందని ఐటి శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. వరల్డ్ బ్యాంక్ ప్రెసిడెంట్‌తో మంచి వాతావరణంలో చర్చలు ఫలప్రదంగా జరిగాయని కొనియాడారు. ఫారిన్ టూర్ నుంచి సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, అధికారులు హైదరాబాద్‌కు చేరుకున్నారు. 11 రోజుల తరువాత సిఎం హైదరాబాద్‌కు చేరుకున్నారు. శంషాబాద్ విమానాశ్రయం చేరుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుకు కాంగ్రెస్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీధర్ బాబు మీడియాతో మాట్లాడారు. విదేశాల్లో తెలంగాణకు మంచి ఎంకరేజ్ మెంట్ ఉందని, తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు ఉత్సాహంగా ఉన్నారని, కాగ్నిజెంట్‌తో పాటు చాలు కంపెనీలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నాయని మంత్రి శ్రీధర్ బాబు తెలియజేశారు. రాజకీయాలకు అతీతంగా నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని వివరించారు. మూసీనది పునర్ నిర్మాణం చేపడతామని హామీ ఇచ్చారు. తాము ఎలాంటి భేషజాలకు వెళ్లకుండా అభివృద్ధి కోసం పని చేస్తున్నామని, విదేశీ పారిశ్రామికవేత్తలకు నమ్మకం కలిగించేలా చర్చలు జరిపామని, రాజకీయాలకు అతీతంగా విదేశాల్లో అందరినీ కలిశామని బాబు స్పష్టం చేశారు. ఐటి, ఇండస్ట్రీస్ రంగాల్లో మరిన్ని పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందన్నారు.



## ఆ రెండు ప్రాజెక్టుల విషయంలో ఎపితో కలిసి పని చేస్తాం: ఉత్తమ్

హైదరాబాద్: ప్రాజెక్టుల సెఫ్టీని తెలంగాణ ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలిస్తోందని భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఇప్పటికే నాగార్జున సాగర్, జూరాల, సింగూరు, కడెం ప్రాజెక్టుల రిపేర్లు పూర్తి చేశామని వివరించారు. ప్రాజెక్టుల మెయిన్‌టెనెన్స్ కోసం ప్రభుత్వం రూ.350 కోట్లు విడుదల చేసిందని వెల్లడించారు. కర్నాటక రాష్ట్రంలో భారీ వర్షాల కురవడంతో తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకొని పోయిన విషయం తెలిసిందే. ఇప్పుడు తెలంగాణలోని ప్రాజెక్టుల పరిస్థితి ఏంటని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల విషయంలో ఎపి ప్రభుత్వంతో కలిసి పని చేస్తామని తెలియజేశారు. ఈ ప్రాజెక్టుల్లో బురద, ఇసుక తొలిగింపు పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అన్ని డ్యామ్‌లను మేడిగడ్డతో పోల్చొద్దని, మేడిగడ్డ డిజైన్ బాగోలేదని, నాసిరకంగా నిర్మించారని, మెయిన్‌టెనెన్స్ బాగోలేకపోవడంతో కుంగిపోయిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. తెలంగాణలో ప్రాజెక్టుల సెఫ్టీని మానిటరింగ్ చేసేందేకు డ్యామ్ సెఫ్టీ అధికారి ఇంజనీరింగ్ చీఫ్‌గా నాగేందర్ రావు ఉన్నారని తెలియజేశారు. ప్రాజెక్టులో సమస్యలు వస్తే ఆయన కింది స్థాయి అధికారులకు సలహాలు, సూచనలు చేస్తారని తెలిపారు.



## 122 మంది ఉద్యోగులు రిలీవ్

హైదరాబాద్ : తెలంగాణ స్థానికత ఉన్న ఉద్యోగులను రిలీవ్ చేస్తూ ఏపీ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జా రీ చేసింది. విభజన సమయంలో కేటాయించిన 122 మంది నాన్ గెజిటెడ్ ఉద్యోగులను స్వరాష్ట్రానికి పంపాలని ఉత్తర్వుల్లో పేర్కొం ది. తెలంగాణ అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన ఏపీ ప్రభు త్వం ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. రిలీవ్ అయ్యే వారు తమ కేడర్ చివరి ర్యాంక్‌లోనే విధుల్లో చేరతారని వెల్లడించింది. ప్రస్తు తం వేర్వేరు విభాగాల్లో పనిచేస్తున్న తెలంగాణ స్థానికత కలిగిన ఉ ద్యోగులను రిలీవ్ చేసే ముందు వారి నుంచి అంగీకారం తీసుకోవాలని స్పష్టం చేసింది. తెలుగు రాష్ట్రాల విభజన పూర్తయి పదేళ్లు గడుస్తున్నా తెలంగాణ స్థానికత ఉన్న ఉద్యోగులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో ఏపీ నుంచి తమను రిలీవ్ చేయాలని తెలంగాణ ఉద్యోగులు రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఇటీవల విజ్ఞప్తి చేశారు. ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నా యుడుకు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ స్థా నికత ఉన్న ఉద్యోగులు అభ్యర్థనలు పంపారు.అయితే ఆంధ్రప్రదే శ్ రాష్ట్రంలో మొత్తం 712 మంది తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఉ ద్యోగులు ఉన్నారని సమాచారం. సచివాలయంతో పాటు వివిధ హెచ్ఓడిల కార్యాలయాలు, 9 10 షెడ్యూల్ సంస్థల్లో పని చేస్తు న్న 224 మంది రాష్ట్ర కేడర్ ఉద్యోగులు తమను రిలీవ్ చేయాలని కోరారు. ఈ క్రమంలోని తాజాగా సీఎం చంద్రబాబు 122 మంది నాన్ గెజిటెడ్ ఉద్యోగులను స్వరాష్ట్రానికి పంపాలని నిర్ణయించే వారిని రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



## కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ తిరస్కరించిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ : ఎక్సైజ్ పాలసీ కేసుకు సంబంధించి సిబిఐ దాఖలు చేసిన అవినీతి కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి అర్వింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరుకు సుప్రీం కోర్టు బుధవారం నిరాకరించింది. తన అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీ దాఖలు చేసిన పిటిషన్‌పై దర్యాప్తు సంస్థ స్పందనను కోర్టు కోరింది. న్యాయమూర్తులు సూర్యకాంత్, ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం ముందు విచారణ ప్రారంభం కాగా, కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి వాదిస్తూ, ఈ కుంభకోణంతో ముడిపడిన మనీ లాండరింగ్ కేసులో బెయిల్ మంజూరుకు కఠిన షరతులు విధించినప్పటికీ మూడు సందర్భాల్లో బెయిల్ మంజూరైందని తెలియజేశారు. మే 10, జూలై 12 తేదీల్లో సర్వోన్నత న్యాయస్థానం జారీ చేసిన మధ్యంతర బెయిల్ ఉత్తర్వులను, జూన్ 20న విచారణ కోర్టు మంజూరు చేసిన మామూలు బెయిల్‌ను సింఘ్వి ఈ సందర్భంగా ప్రస్తావించారు. జూన్ 20 నాటి విచారణ కోర్టు ఉత్తర్వుపై 'మౌఖిక ప్రస్తావన'పై ఢిల్లీహైకోర్టు స్టే ఇచ్చిందని సింఘ్వి తెలిపారు. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) కింద కఠిన షరతులు విధించినప్పటికీ కేజ్రీవాల్ బెయిల్ పొందగలిగినప్పుడు మనీలాండరింగ్ చట్టం వంటి అటువంటి కఠిన నిబంధనలు అ కోపవినీతి నిరోధక చట్టం (పిసిఎ)లో లేనందున సిబిఐ కేసులో మామూలు బెయిల్‌ను నిరాకరించరాదని సింఘ్వి వాదించారు. 'అలా చెప్పడానికి నేను ఇష్టపడను. కానీ నేను ప్రతి చోట చెప్పాను. ఈ నిర్దిష్ట అరెస్టును బీమా అరెస్టు అనవచ్చు. ఏప్రిల్ 23న మీరు నన్ను తొమ్మిది గంటల పాటు ప్రశ్నించారు. ఇడి నన్ను మార్చి 24న అరెస్టు చేసేంత వరకు మీ వద్ద నుంచి తిరిగి ఎటువంటి చర్యా లేదు. నాకు మూడు విడుదల ఉత్తర్వులు వచ్చాయి. సరిగ్గా ఉత్తర్వు వచ్చే సమయానికి నన్ను జూన్‌లో అరెస్టు చేశారు' అని సింఘ్వి చెప్పారు. కేజ్రీవాల్ ఆరోగ్య పరిస్థితుల గురించి సింఘ్వి ప్రస్తావిస్తూ, మధ్యంతర బెయిల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మధ్యంతర బెయిల్ కోసం అర్జీని ఇప్పటికే దాఖలు చేసినట్లు ఆయన తెలియజేశారు. 'మేము మధ్యంతర బెయిల్ మంజూరు చేయడం లేదు' అని సర్వోన్నత న్యాయస్థానం సింఘ్వితో చెప్పింది. అప్పుడు 'వీలైనంత సత్వర తేదీ' కోసం సీనియర్ న్యాయవాది విజ్ఞప్తి చేశారు. ఈ నెల 23న విచారణ జరుపుతామని బెంచ్ తెలిపింది. ముఖ్యమంత్రి అరెస్టును చట్టబద్ధమైనదిగా ఢిల్లీ హైకోర్టు ఈ నెల 5న ధ్రువీకరించింది.



## జమ్మూ ఎన్‌కౌంటర్‌లో ఆర్మీ కెప్టెన్ మృతి

జమ్మూ: జమ్మూ ప్రాంతంలోని దోడా జిల్లాలో ఉగ్రవాదులకు, భద్రతా దళాలకు మధ్య జరుగుతున్న కాల్పుల పోరులో ఒక ఆర్మీ కెప్టెన్ మరణించగా మరో నలుగురు ఉగ్రవాదులు హతమైనట్లు అధికారులు తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజు జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో ఒక పౌరుడు గాయపడినట్లు వారు చెపపారు. శివ్‌గఢ్–అస్సార్ బెల్ట్‌లోని దట్టమైన అటవీ ప్రాంతంలో నక్కి ఉన్న ఉగ్రవాదుల కోసం భద్రతా దలాలు గాలింపు జరుపుతుండగా ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. కాల్పులలో తీవ్రంగా గాయపడిన ఆర్మీ కెప్టెన్‌ను సైనిక ఆసుపత్రికి తరలించగా అక్కడ ఆయన మరణించారని అధికారులు చెప్పారు. కాగా, ఆ ప్రాంతంలో రక్తంతో తడిసిన నాలుగు గోనెసంచులు దొరికాయని, నలుగురు ఉగ్రవాదులు మరనించి ఉంటారని అనుమతిస్తున్నామని అధికారులు తెలిపారు. ఆ ప్రాంతంలో ఎం 4 కార్బైన్స్ కూడా లభించినట్లు వారు చెప్పారు. ఉగ్రవాదుల కోసం గాలింపు కొనసాగుతోందని వారు చెప్పారు.



## తెలంగాణలో ఉపఎన్నికకు నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్: తెలంగాణలో రాజ్యసభ ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసింది. బిఆర్ఎస్ పార్టీతో పాటు రాజ్యసభ సభ్యత్వానికి కె. కేశవరావు రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. ఇవాళ్టి నుంచి ఈ నెల 21 వరకు నామినేషన్లను స్వీకరిస్తారని ఎన్నికల సంఘం తెలిపింది. ఆగస్టు 27న పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. ఒకవేళ ఎన్నిక అవసరమైతే సెప్టెంబర్ 3న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగనుంది. అదేరోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఎన్నికల సంఘం వివరించింది. కె కేశవరావు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే.

## థాయిలాండ్ ప్రధానిపై వేటు

బ్యాంకాక్ : నైతిక నిబంధనలను ఉల్లంఘించారనే ఆరోపణపై థాయిలాండ్ ప్రధాని స్రెట్టా థావిసిన్‌ను ఒక న్యాయస్థానం బుధవారం పదవిలో నుంచి తొలగించింది. ఒక వారం క్రితం ప్రధాన ప్రతిపక్షం రద్దుకు కోర్టు ఆదేశించిన తరువాత థాయ్ రాజకీయాల్లో మరింత సంక్షోభానికి దారి తీసింది. ఒక కోర్టు అధికారికి లంచం ఇవ్వజూపారనే అభియోగంపై జైలు శిక్ష అనుభవించిన ఒకరిని క్యాబినెట్ మంత్రిగా నియమించినందుకు స్రెట్టాపై రాజ్యాంగ న్యాయస్థానం ఈ చర్య తీసుకున్నది. కోర్టు 5:4తో స్రెట్టాపై ఈ తీర్పు వెలువరించింది. కొత్త ప్రధానిని పార్లమెంట్ ఆమోదించేంత వరకు ఆపద్ధర్మ ప్రాతిపదికపై మంత్రివర్గం కొనసాగుతుంది. ఆ ఖాళీని భర్తీ చేసేందుకు పార్లమెంట్‌కు ఎటువంటి గడువూ లేదు. ఏప్రిల్‌లో మంత్రివర్గ పునర్వవస్థీకరణలో పిచిత్ చుయెన్‌బాన్‌ను ప్రధాని కార్యాలయం (పిఎంఒ)లో ఒక మంత్రిగా స్రెట్టా నియమించారు. మాజీ ప్రధాని తక్సిన్ షినవత్రాకు ప్రమేయం ఉన్న ఒక కేసులో ఒక సరకుల సంచీలో 20 లక్షల బహత్‌లు (55 వేల అమెరికన్ డాలర్లు) నగదుతో ఒక న్యాయమూర్తికి లంచం ఇవ్వజూపారనే ఆరోపణపై పిచిత్‌ను విచారించిన అనంతరం కోర్టు ధిక్కరణ అభియోగాలపై ఆయనను 2008లో ఆరు నెలల పాటు జైలులో ఉంచారు. మంత్రిగా నియుక్తుడైన కొన్ని వారాలకు ఆ ఘటనపై వివాదం తిరిగి రేగగా పిచిత్ తన పదవికి రాజీనామా చేశారు. పిచిత్ ఇప్పటికే జైలు శిక్ష అనుభవించినప్పటికీ సుప్రీం కోర్టు ఆదేశానుసారం ఆయన ప్రవర్తన అనైతికమని కోర్టు వ్యాఖ్యానించింది. తన క్యాబినెట్ నియామకాలకు సంబంధించి మంత్రుల అర్హతలను ముందుగా తెల్చుకోవలసిన ఏకైక బాధ్యత ప్రధానిగా స్రెట్టాదేనని కోర్టు స్పష్టం చేసింది.





# అవినీతిపై కొరడా....

రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్‌రెడ్డి అవినీతి నిరోధకశాఖ అధికారులు పన్నిన వలలో చిక్కారు. ధరణిలో నెలకొన్న సమస్యను పరిష్కరించేందుకు బాధితుడు ముత్యంరెడ్డి అనే వ్యక్తి నుండి రూ.8 లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసిబి అధికారులు వారిని పట్టుకున్నారు. సంచలన రేపిన ఈ ఘటనకు సంబంధించి ఏసిబి అధికారులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. ముత్యంరెడ్డి అనే వ్యక్తి తనకున్న 14 గుంటల భూమిని ధరణి వెబ్‌సైట్‌లో ప్రొహిబిటెడ్ లిస్ట్ నుండి తొలగించాలని కోరాడు. అందుకుగాను సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్‌రెడ్డి ఎనిమిది లక్షలు డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో సదరు బాధితుడు ఏసిబి అధికారులను ఆశ్రయించాడు. ఈమేరకు సోమవారం రాత్రి 11 గంటల సమయంలో ఓఆర్ఆర్ పరిధిలో బాధితుడు ముత్యంరెడ్డి నుండి సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్‌రెడ్డి ఎనిమిది లక్షల రూపాయలు నగదును లంచంగా తీసుకుంటుండగా ఏసిబి అధికారులు రంగప్రవేశం చేశారు. లంచం తీసుకుంటున్న సీనియర్ అసిస్టెంట్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. అయితే అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి ప్రోద్భలంతోనే తాను లంచం డిమాండ్ చేసినట్లు సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్‌రెడ్డి ఏసిబి అధికారులకు తెలిపాడు. ఏసిబి అధికారులు సీనియర్ అసిస్టెంట్ ఫోన్ నుండి అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి ఫోన్ చేయించి అతనితో మాట్లాడించారు. దీంతో పెద్దఅంబర్‌పేట్ అవుటర్ రింగ్‌రోడ్డు వద్దకు డబ్బులు తీసుకురావాలని అడిషనల్ కలెక్టర్ ..సీనియర్ అసిస్టెంట్‌కు తెలిపాడు. ఫోన్ సంభాషణలను విన్న ఏసిబి అధికారులు అత్యంత చాకచక్యంగా అక్కడికి చేరుకుని అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డికి సీనియర్ అసిస్టెంట్ మదన్ మోహన్‌రెడ్డి డబ్బులు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సినీపక్కీలో నిందితులను అదుపులోకి తీసుకున్న ఏసిబి అధికారులు వారి వద్ద నుండి నగదు స్వాధీనం చేసుకున్నారు.

# కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారికీ గృహజ్యోతి వర్తింపు : ఉప ముఖ్యమంత్రి భట్టి



హైదరాబాద్ : విద్యుత్ ఉత్పత్తి విషయంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఉన్నతాధికారులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశించారు. మహాత్మ జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో ట్రాన్స్ కో, జెన్ కో, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి అధికారులతో ఉప ముఖ్యమంత్రి సమీక్ష జరిపారు.
ఈ సందర్భంగా జెన్ కో నిర్వహించే విద్యుత్తు ఉత్పత్తి రంగ సంస్థల్లో ఏర్పడే సాంకేతిక సమస్యలను పరిష్కరించడానికి త్రిసభ్య కమిటీ వేయాలని సూచించారు. విద్యుత్ ఉత్పత్తి రంగ సంస్థల్లో ఏర్పడే సాంకేతిక సమస్యలను ఈ కమిటీ క్షేత్రస్థాయికి వెళ్లి అధ్యయనం చేసి పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి నివేదిక ఇవ్వాలని చెప్పారు. వారిచ్చిన నివేదిక ఆధారంగా జెన్ కో సీఎండీ నిర్ణయం తీసుకుని విద్యుత్తు ఉత్పత్తికి అంతరాయం రాకుండా చూడాల్సిందిగా ఆదేశించారు. భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ యూనిట్ -1లో జనరేటర్ ట్రాన్స్ ఫార్మార్ మరమ్మతులు చేయాలా? లేక కొత్తది కోనుగోలు చేయాలా? అనే అంశాన్ని టెక్నికల్ కమిటీకి పరిశీలిస్తోందని అన్నారు. డిసెంబర్ 2023కు ముందు గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల అమలుకు సంబంధించి తప్పనిసరిగా ఈ ప్రభుత్వానికి నివేదించాలని ఈ సందర్భంగా అధికారులకు భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు. నిర్ణయాలను అమలు చేసే సమయంలో సీఎండీలు తప్పనిసరిగా ఎనర్జీ సెక్రెటరీని సంప్రదించాలని సూచించారు.
జల విద్యుత్ కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు ఎదురైతే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని, ఇందులో ఎలాంటి ఆలసత్వం వహించవద్దని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం గురించి ఆరా తీశారు. గృహజ్యోతి పథకానికి అర్హులై ఉండి గతంలో దరఖాస్తు చేసుకోని వారికి తిరిగి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించి గృహ జ్యోతి పథకాన్ని వారికి వర్తింపచేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో 227 సబ్ స్టేషన్ల నిర్మాణానికి ప్రక్రియ మొదలైందని చెప్పారు, అందులో 113 సబ్ స్టేషన్లకు స్థల సమస్య లేదని మిగతా వాటికి స్థలాలు కలెక్టర్లు కేటాయించాల్సి ఉందని చెప్పారు.
కాళేశ్వరం, ఇతర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఎన్ని మెగావాట్ల విద్యుత్ ను ఉపయోగిస్తున్నారు? అందుకు ఎంత మేర ఖర్చు అవుతోందో మొత్తం వివరాలతో నివేదిక ఇవ్వాలని అధికారులకు స్పష్టంగా చెప్పారు.
ఈ సమస్య సమావేశంలో ఎనర్జీ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ అలీ, ఎన్పీడీసీఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, ట్రాన్స్ కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు

## ట్రెయినీ డాక్టర్‌పై సామూహిక...

# అత్యాచారం?




కోల్‌కత: కోల్‌కతలోని ఆర్‌జి కర్ ఆసుపత్రిలో హత్యకు గురైన 31 సంవత్సరాల పోస్టు గాడ్యుయేట్ ట్రెయినీ డాక్టర్‌పై సామూహిక అత్యాచారం జరిగినట్లు పోస్టు మార్టమ్ నివేదిక సూచిస్తోందని ప్రభుత్వ వైద్యుల సంఘం అఖిల భారత సమాఖ్య అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుబర్ణ గోస్వామి వెల్లడించారు. ట్రెయినీ డాక్టర్ శరీరంపై ఉన్న గాయాలను బట్టి అవి ఒక వ్యక్తి వల్ల అయ్యేవి కావని అర్థమవుతుందని ఆయన చెప్పారు. మృతురాలి మర్మాంగంలో 151 గ్రాముల వీర్యం లభించినట్లు పోస్టు మార్టమ్ నివేదిక వెల్లడించిందని, అయితే అంత ఎక్కువ పరిమాణంలో వీర్యం ఒక వ్యక్తికి చెందినది ఉండదని డాక్టర్ గోస్వామి ఒక ఆంగ్ల చానల్‌తో మాట్లాడుతూ తెలిపారు. దీన్నిబట్టి చూస్తే ఈ హత్యాచారంలో ఒకరి కన్నా ఎక్కువ మంది ఉండవచ్చని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఈ అమానవీయ ఘటన వెనుక చాలామంది పాత్ర ఉండవచ్చని బాధితురాలి కుటుంబ సభ్యులు కూడా అనుమానం వ్యక్తం చేశారని ఆయన గుర్తు చేశారు. బాధితురాలి శరీరంపై ఉన్న గాయాలు, జరిగిన బల ప్రయోగం ఒక వ్యక్తి చేసిన పని కాదని ఆయన అన్నారు. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే కెజి కర్ ఆసుపత్రిలోని సెమినార్ హాలులో శుక్రవారం ఉదయం అర్ధనగ్న స్థితిలో ట్రెయినీ డాక్టర్ మృతదేహం లభించింది. ఈ కేసుకు సంబంధించి కోల్‌కత పోలీసుకు చెందిన మున్సిపల్ వాలంటీర్ సంజయ్ రాయ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. బాధితురాలిని గొంతు నులిమి చంపివేసినట్లు పోస్టు మార్టమ్ నివేదిక నిర్ధారిస్తోంది. గొంతు నులమడంతో ఆమె థైరాయిడ్ కార్టిలేజ్ విరిగిపోయింది. ఆమె మర్మాంగం వద్ద లోతైన గాయం ఉంది. వికృత లైంగికత కారణంగా ఈ గాయం జరిగినట్లు పోస్టు మార్టమ్ నివేదిక పేర్కొంది. అంతేగాక ఆమె నడుము, పెదాలు, చేతి వేళ్లు, ఎడమ కాలుపై కూడా గాయాలు ఉన్నాయి. ఆమె రెండు కళ్లు, నోటి నుంచి రక్తం కారుతున్నట్లు పోస్టు మార్టమ్ నివేదిక పేర్కొంది. అత్యాచారం జరిగిన సమయంలో బాధితురాలు అరవకుండా ఆమె ముక్కును, నోటిని మూశారని, ఆమె తలను గోడకు అదిమిపెట్టారని పోస్టు మార్టమ్ నివేదిక పేర్కొంది. ఆమె ముఖంపై రక్కినట్లు గీతలు ఉన్నాయని నివేదిక తెలిపింది. ఆమె గట్టిగా అరవకుండా ఆమె నోటిని, గొంతును చాలాసేపు అదిమిపెట్టినట్లు నివేదిక తెలిపింది. బాధితురాలి కాళ్లు బాగా విడదీసినట్లు ఉన్నాయని ఆమె కుటుంబ సభ్యుల పేర్కొన్నారు. ఆమె కళ్ల జోడు పగిలిపోయిందని, ఆమె రెండు కళ్లలో అద్దాలు గుచ్చుకున్నాయని, గొంతు నులమడంతో ఆమె మరణించిందని బాధితురాలి బంధువు ఒకరు తెలిపారు.

## రికార్డు సృష్టించిన శ్రీలంక అధ్యక్ష ఎన్నిక..


# బరిలో 38 మంది అభ్యర్థులు




కొలంబో: ఈ ఏడాది సెప్టెంబర్ 21న జరగనున్న శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో రికార్డు స్థాయిలో అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. అధ్యక్ష ఎన్నికలకు సంబంధించిన డిపాజిట్ చెల్లింపునకు బుధవారం మధ్యాహ్నం గడువు ముగియగా 42 సంవత్సరాల శ్రీలంక చరిత్రలో మొట్టమొదటిసారి 38 మంది అభ్యర్థులు డిపాజిట్ చెల్లించారు. ఈ 38 మంది అభ్యర్థులలో 20 మంది రిజిస్టర్డ్ రాజకీయ పార్టీల నుంచి కాగా 17 మంది స్వతంత్రులు. ఒక అభ్యర్థి సమన్ శ్రీ రత్నాయకె రాజకీయ గ్రూపునకు చెందిన వ్యక్తి. నామినేషన్ల స్వీకరణకు గురువారంతో గడువు ముగుస్తుంది. డిపాజిట్లు చెల్లించిన 38 మంది అభ్యర్థులు తమ నామినేషన్లు సమర్పించిన పక్షంలో శ్రీలంకలో ఇంత పెద్ద సంఖ్యలో అభ్యర్థులు బరిలో నిలవడం ఇదే మొదటిసారి అవుతుంది. 2019లో చివరిసారి అధ్యక్ష ఎన్నికలు జరిగినపుడు 35 మంది అభ్యర్థులు పోటీ చేశారు. పోటీలో నిలుస్తున్న ముఖ్యులలో ప్రస్తుత అధ్యక్షుడు విక్రమసింఘెతోపాటు రాజపక్స వారసుడిగా బరిలోకి దిగుతున్న 38 ఏళ్ల నమల్ రాజపక్స, ప్రధాన ప్రతిపక్ష నాయకుడు సాజిత్ ప్రేమదాస, మార్క్సిస్టు జెవిపి నాయకుడు అనుర కుమార దిసనాయకె తదితరులు ఉన్నారు. 1982లో మొదటిసారి జరిగిన అధ్యక్ష ఎన్నికలో కేవలం ఆరుగురు అభ్యర్థులు మాత్రమే పోటీ పడ్డారు. శ్రీలంకలోని 22 జిల్లాలకు చెందిన 1.70 కోట్ల మంది ఓటర్లు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

# నీరజ్ చోప్రాతో ప్రేమ.. క్లారిటీ ఇచ్చిన మను బాకర్

న్యూఢిల్లీ: స్టార్ అథ్లెట్ నీరజ్ చోప్రాతో తాను ప్రేమలో ఉన్నట్టు వస్తున్న వార్తలను భారత షూటింగ్ సంచలనం మను బాకర్ ఖండించింది. తాను, నీరజ్ ప్రేమించుకుంటున్నట్టు కొంత మంది ప్రచారం చేయడం బాధగా ఉందని పేర్కొంది. నీరజ్‌తో తనకు అంతగా ఇంటరాక్షన్ లేదు. వివిధ పోటీలు, ఇతర కార్యక్రమాల్లో ఎదురుపడినప్పుడు సరదాగా మాట్లాడుకుంటాం. అంతేకానీ తాము ప్రేమలో ఉన్నట్లు సోషల్ మీడియాలో కొందరు పనిపట్టుకుని ప్రచారం చేయడం ఏమాత్రం బాగలేదని వ్యాఖ్యానించింది. ఈ మధ్య తాను నీరజ్‌తో మాట్లాడాను. ఆ సమయంలో ఎవరో దాన్ని వీడియో తీశారు. ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో తమ మధ్య ఏదో ఉన్నట్టు ఊహాగానాలు చెలరేగాయి. ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదు. అభిమానులు కూడా దీన్ని పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని మను బాకర్ స్పష్టం చేసింది.




# రాజ్యసభ కాంగ్రెస్ అభ్యర్థిగా అభిషేక్ సంఘ్వీ



హైదరాబాద్ : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అభిషేక్ సింఘ్వీ రాజ్యసభ కు ఎన్నికకానున్నారు.. తెలంగాణకు ప్రాతినిధ్యం వహిస్తున్న కె కేశవరావు తన రాజ్య సభ సభ్యత్వానికి ఇటీవల రాజీనామా చేశారు.. దీంతో ఈ స్థానానికి నిర్వహించే ఉప ఎన్నిక కోసం ఎన్నికల కమిషన్ నేడు నోటిపికేషన్ విడుదల చేసింది.. ఈ స్థానానికి సెప్టెంబర్ మూడో తేదిన అవసరమైతే ఎన్నిక జరుపుతారు.. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నేడు తమ అభ్యర్థిని ప్రకటించింది.. సీనియర్ నేత అభిషేక్ సంఘ్వీకి అవకాశం కల్పించింది.ఆయన ఈ నెల 21వ తేది లోగా నామినేషన్ దాఖలు చేయనున్నారు.. ప్రస్తుత అసెంబ్లీలో కాంగ్రెస్ కు ఉన్న బలం దృష్ట్యా ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశాలున్నాయి.

# ప్రతి ఇంట మువ్వన్నెల జెండా రెపరెపలు: చంద్రబాబు పిలుపు




అమరావతి: ప్రజలందరికీ ఏపీ సీఎం చంద్రబాబు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. మహోజ్వల చరిత గల మన దేశ సమగ్రతను కాపాడటం అందరి కర్తవ్యమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు వరుసగా మూడో సంవత్సరం 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నట్లు చెప్పారు. 'ఇంటింటా జాతీయ జెండా' అనే ఈ కార్యక్రమం విస్తృత కార్యక్రమంగా మారడం ఆనందకర విషయమని తెలిపారు. తెలుగువారైన పింగళి వెంకయ్య రూపొందించిన మువ్వన్నెల జెండా ప్రతి ఇంటిపై రెపరెపలాడటం మనకు మరింత ప్రత్యేకం, గర్వకారణమని కొనియాడారు. ప్రతి ఇల్లు, కార్యాలయంపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని కోరారు. జాతీయ జెండాను సోషల్ మీడియా పేజీల్లో ప్రొఫైల్ పిక్‌గా పెట్టుకోవాలన్నారు. ఇవన్నీ మనలో జాతీయ భావాన్ని కల్పిస్తాయని, స్ఫూర్తిని నింపుతాయని చంద్రబాబు పేర్కొన్నారు.

# దేశవిభజన మిగిల్చిన విషాదాలు!




అనాలోచితంగా, అజ్ఞానంగా, వివాదాస్పదంగా, అకారణంగా, విభజించి విచ్ఛిన్నం చేయాలనే దుర్బుద్ధితో అఖండ భారతాన్ని ఇండియా, పాకిస్థాన్‌గా అశాస్త్రీయ రాజకీయ విభజన చేసిన కారణంగా నాటి ప్రజలు పడ్డ బాధలు, విద్వేషాలు, హింసాగ్నిలో లక్షల ప్రజలు నిర్వాసితులు కావడం, మాన ప్రాణాలు కోల్పోవడం హిందుస్థాన్‌లో ఓ మరువలేని మహావిషాద దుర్ఘటన. మతపరంగా విభజన కోరిన ముస్లిమ్‌లు పాకిస్థాన్ స్వాతంత్ర్య దినాన్ని 14 ఆగష్టున పాటిస్తున్నారు. శవాల కుప్పలు, ధౌర్జన్యకర విషాదాల పునాదిగా జరిగిన విభజన దేశ చరిత్రలో ఓ చీకటి రోజు. 1947 ఆగష్టు 15 అర్ధరాత్రి లభించిన భారత స్వాతంత్ర్యానికి సంబరాలు చేసుకోవాలో, విభజన విష వలలో చిక్కిన అమాయక ప్రజలు కోల్పోయిన మాన ప్రాణాలను చూసి దుఃఖించాలో తెలియని దుస్థితి నాటి ప్రతి బాధ్యతగల భారతీయ పౌరుడిది. బ్రిటీష్ పాలకులు వ్యాపార బుద్ధితో ప్రవేశించి, దేశ సంస్కృతీ వారసత్వాలను నాశనం చేసి, దేశ సంపదను పీల్చేసి, శవాల దిబ్బలను మిగిల్చి వెళ్ళిన దుర్దినమది.

ముఖంపై స్వాతంత్ర్యం దక్కిందనే సంతోషం, మదిలో విభజన చేసిన గాయాల బాధల నడుమ దేశం పరాయి పాలన నుండి విముక్తం అయ్యింది. విభజన అకాలంలో జరిగిన హింసాత్మక ఘటనలు, మారణహోమాలు భారతీయులపై చెరగని శాశ్వత మచ్చలుగా మిగిలిపోయాయి. అఖంధ భారతదేశ విభజన అత్యధిక మానవ వలసలను చవి చూసింది. లక్షల కుటుంబాలు, దాదాపు 2 కోట్ల ప్రజలు తమ తమ వారసత్వంగా వచ్చిన పల్లెలు, పట్టణాలు, నగరాలు, జన్మ భూములను వదిలి ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని కొత్త జీవితాలను వెతుక్కోవలసిన దుస్థితి అది.

దేశ విభజన సమయంలో జరిగిన రక్తపాతం, హింసోన్మాదానికి, అరాచక అకృత్యాలకు బలైన భరతమాత బిడ్డలను స్మరించుకోవాలనే సదభిప్రాయంతో ప్రతి ఏట 14 ఆగష్టున 'విభజన విషాద స్మృతి దినం (పార్టీషన్ హారర్స్ రిమెంబ్రెన్స్ డే)' పాటించాలని నిర్ణయించడం సముచితమే కాదు హర్షదాయకం కూడా. 15 ఆగష్టు 1947 స్వాతంత్ర్య సంబరాల వేదికగా మహాత్మాగాంధీ మాట్లాడుతూ 'రెండు దశాబ్దాల తెల్ల దొంగల దాస్య శృంఖలాలను ఛేదించుకొని, బానిస బతుకులకు చరమగీతం పాడుతూ భారతీయులు స్వేచ్ఛావాయువులు పీల్చాలంటూనే, దేశ విభజనకు అంగీకరించాలి' అని కోరారు. గత 77 ఏండ్లుగా విభజన గాయాలను మర్చిపోలేనప్పటికీ, సమగ్రాభివృద్ధి దిశగా నిరంతరం ప్రగతి పయనాలు కొనసాగుతునే ఉన్నాయి.

భారతదేశం పట్ల కనీస జ్ఞానం లేని బ్రిటీష్ లాయర్ 'సర్ సిరిల్ రెడ్‌క్లిఫ్' అఖండ భారత పటంపై గీసిన దేశ సరిహద్దు గీతలు కోట్ల ప్రజలకు పెనుశాపాలుగా మారడంతో పాటుగా, ఆ జ్ఞాపకాలు మన గుండెల్ని నేటికి విషాద సంద్రంలో ముంచేస్తూనే ఉన్నాయి. సువిశాల భారత విభజనతో ఇండియా, పాకిస్థాన్ (ఈస్ట్ అండ్ వెస్ట్ పాకిస్థాన్) ఏర్పడ్డాయి. ముస్లిమ్‌లు అధికంగా ఉన్న పంజాబ్ ప్రాంతాన్ని వెస్ట్ పాకిస్థాన్(నేటి ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ పాకిస్థాన్)గా, ముస్లిమ్‌లు అధికంగా ఉన్న బెంగాల్ ప్రాంతాన్ని ఈస్ట్ పాకిస్థాన్‌గా (నేటి పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ బంగ్లాదేశ్) వేరు చేశారు. ఈస్ట్ పాకిస్థాన్ ప్రజల కోరిక మేరకు 1971లో ఇండో-పాక్ యుద్ధంలో బంగ్లాదేశ్‌ను విముక్తం చేయడంలో కూడా భారత దేశం 2,500-3,843 మంది సైనికుల ప్రాణాలు కోల్పోవడం, 12,000 మంది జవాన్లు గాయాల పాలుకావడం, అపార ఆర్థిక నష్టాన్ని భరించడం చూశాం. 1947లో జరిగిన దేశ విభజన ప్రపంచ చరిత్రలో అతి పెద్ద హింసాత్మక, రక్తం ఏరులై పారిన అర్థరహిత రాజకీయ మానవ వలసగా చరిత్రకారులు పేర్కొంటారు. మిలియన్ల మానవ వలసలు, లక్షల మరణాలు, వేల మానభంగాలతో అత్యంత అమానవీయంగా దేశ విభజన మరువలేని విషాదాన్ని మిగిల్చింది.

పాకిస్థాన్ ప్రాంత హిందువులు, సిక్కులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని భారత సరిహద్దుల్లోకి పరుగులు తీయడం, భారత్‌లోని ముస్లిమ్‌లు అధికంగా ఇక్కడే ఉండాలని నిర్ణయించుకోవడం కూడా విస్మయంతో చూశాం, నేటికీ సమైక్యతకు కలుగుతున్న విఘాతాలను భరిస్తున్నాం. నాటి వాషింగ్టన్ పోస్ట్ పత్రిక కథనం ప్రకారం, అశాస్త్రీయ మత రాజకీయాల ఆధారంగా చేసిన దేశ విభజనలో 2 లక్షల నుంచి 20 లక్షల వరకు అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయి ఉంటారని, 10 నుంచి 20 మిలియన్ల మానవ వలసలు జరిగాయని అంచనా వేసింది. విభజనతో ప్రాణాలు, జీవనోపాధులు కోల్పోయిన భారతీయుల వలసల వల్ల దేశ విద్య, ఆర్థిక స్థితులపై అధిక ప్రతికూల ప్రభావం పడింది.

హిందువుల ఇండ్లను కాల్చి వేయడం, సంపదను దోచుకోవడం, మహిళల్ని రేప్ చేయడం, పిల్లల్ని కసాయి కత్తులను బలి చేయడం, రక్తంతో నిండిన రైళ్లు సవాల కుప్పల్ని రవాణ చేయడం, ప్రయాణీకులను నిర్దాక్షిణ్యంగా మత వివక్షతో చంపేయడం లాంటి అమానవీయ ఘటనలు చవి చూసింది భారత విషాద విభజన. ఐరాస అంచనా ప్రకారం విభజన విషాదంలో 14-20 మిలియన్ల అమాయక హిందువులు, సిక్కులు, ముస్లిమ్‌లు కాలినడకన బిడ్డల్ని సంకన ఎత్తుకొని, మూటముల్లె సర్ది నెత్తిన పెట్టుకొని, ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని సరిహద్దులు దాటడం అత్యంత అమానవీయ ఘోరంగా చరిత్ర పుటల్లో నిలిచింది. భరతమాత బిడ్డలుగా, దేశభక్తి ఉప్పొంగే పౌరులుగా మనందరం ప్రతి ఏట 14 ఆగష్టు రోజున 'విభజన విషాద స్మృతి దినం' పాటించడం మన కనీస కర్తవ్యంగా భావిద్దాం, పరమతసహనాన్ని జీర్ణించుకుందాం, సామరస్యంగా జీవిద్దాం, శాంతియుతంగా పయనిద్దాం, గీత దాటితే వాత పెడదాం.

## సంపాదకీయం

గురువారం, ఆగస్టు 15, 2024

### పాఠశాలల్ని ఉన్నతీకరించాలి...!

తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో ప్రభుత్వ పాఠశాల విద్యారంగం దశను, దిశను మార్చడానికి ప్రయత్నించడం అభినందించదగ్గ అంశం. అందులో భాగంగా గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన ప్రమోషన్లు, బదిలీలు ప్రక్రియను కొనసాగించడం ద్వారా సుమారు ముప్పైవేల మంది టీచర్లకు పదోన్నతి కల్పించడం ప్రభుత్వ విద్యారంగ చరిత్రలో చారిత్రాత్మకమైనది. అందుకు ప్రత్యేకంగా కృషిచేసిన అధికార వర్గ కృషికి కృతజ్ఞతలు తెలుపవలసిందే. ఈ సందర్భంగా ఆయా ఉపాధ్యాయ సంఘాల స్వార్థ చింతన వల్ల అతీగతీ లేకుండా ఆగిపోయిన కామన్ సర్వీస్ రూల్స్ అంశం గూర్చి, అటు ప్రభుత్వ ఇటు పంచాయతీరాజ్ యాజమాన్యాల నాయకులు టీచర్లు ప్రభుత్వ విద్యారంగం ఎదుర్కొంటున్నటు వంటి సంక్షోభ స్థితిని గుర్తిస్తూ 'సొంత లాభం కొంత మానుకుని' పాఠశాలల అభ్యున్నతికి తోడ్పడవలసి ఉన్నది. ఇన్ని వేల ప్రమోషన్లు ఇచ్చినా వేలాదిమంది బదిలీలు జరిగినా పాఠశాల విద్యారంగంలో పర్యవేక్షణ లేకపోవడం వల్ల మొత్తం విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా కొనసాగుతున్నది. 500కు పైగా మండల విద్యాధికారి పోస్టులు 60కి పైగా డిప్యూటీ డిఇఒ పోస్టులు, 30 దాకా జిల్లా విద్యాశాఖ అధికారుల పోస్టులు ఖాళీగా ఉండటంతో ప్రభుత్వ విద్యారంగ నానాటికి పర్యవేక్షణ లేమితో కునారిల్లిపోతున్న వాస్తవాన్ని ఉపాధ్యాయ సంఘాలు గుర్తించవలసి ఉన్నది. అందుకు ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకొని ఈ ఖాళీలతో పాటు డైట్ లెక్చరర్స్, జేఎల్స్, ప్రమోషన్లకు సంబంధించిన అంశాలను కూడా పరిష్కరించాల్సి ఉన్నది. అట్లాగే పర్యవేక్షకులు లేరన్న కారణంతో పదోన్నతి పొందిన టీచర్లు తమ విద్యుక్త ధర్మాన్ని విస్మరిస్తే తాము పొందుతున్న జీతాలకు తమ బడిలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందలేకపోతున్న పిల్లలకు ద్రోహం చేస్తున్నట్లే. ఇన్నివేల ప్రమోషన్స్ ఇచ్చామని ప్రభుత్వం, ప్రమోషన్లు వచ్చాయని సంతోషంలో టీచర్లు... విద్యారంగం ఎదుర్కొంటున్న ఇతర సమస్యలను గుర్తించకపోతే విద్యార్థుల భవిష్యత్తుకు ద్రోహం చేసిన వాళ్లు అవుతారు. పదిమంది పిల్లలు లేని బడిలో కూడా ఓ ఉపాధ్యాయున్ని, 50 మంది పిల్లలు లేని హైస్కూల్లో ఓ హెడ్మాస్టర్‌ని సబ్జెక్టుకు టీచర్‌నిచ్చినా విద్యార్థుల సంఖ్య పెరగకపోవడానికి, ఉన్నతమైన ఫలితాలు రాబట్టలేకపోవడానికి కారణాలను ఈ సందర్భంగా అన్వేషించవలసి ఉన్నది. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం అమలు చేయకపోవడం వల్ల విద్యార్థుల సంఖ్య తరిగిపోతున్నదని వాపోయిన ఉపాధ్యాయ సంఘాలు.. నేడు అన్ని పాఠశాలలు ఇంగ్లిష్ మీడియంగా మారినప్పటికీ ఇవ్వాళ గత సంవత్సరాల కంటే భిన్నంగా విద్యార్థుల సంఖ్య తగ్గటానికి తగిన కారణాలను అన్వేషించవలసి ఉన్నది. ఇటీవల అసర్ నివేదిక ప్రకటించినట్లుగా కనీసం 8వ తరగతి విద్యార్థులు ఐదవ తరగతికి, ఐదవ తరగతి విద్యార్థులు రెండవ తరగతికి సంబంధించిన కనీస సామర్థ్యాలను పొందలేకపోతున్నారని ప్రకటించింది. గతంలో జరిగిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే కూడా విద్యార్థుల కనీస సామర్థ్యాల పట్ల సంతృప్తిని వ్యక్తం చేయలేదు. పదేళ్ల తెలంగాణ ఆవిర్భావం తర్వాత తెలంగాణ రాష్ట్రం విద్యారంగంలో 27వ స్థానంలో ఉందని నివేదికలు ప్రకటించడం ఆందోళన కొలిపే అంశం. ఇందుకు టీచర్లను నిందించడం ఒక కారణం అయితే, ప్రభుత్వం అనుసరిస్తున్న విద్యా విధానాలు మరొక కారణమని స్పష్టమవుతున్నది. గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గటానికి పాఠశాల మీద పర్యవేక్షణ లేమితో పాటు, ఒక్క టీచరు నాలుగైదు తరగతులు బోధించలేని స్థితి, గ్రామీణ ప్రాంత పాఠశాలల్లో కనీస వసతులలేమి, కనీసం బ్లాక్ బోర్డ్‌కు నల్ల రంగు వేయించలేని, గోడలకు తెల్ల సున్నాలు కొట్టలేని దుర్గతిలో పాడుబడ్డ భవనాల్లా ప్రభుత్వ బడులు ఉండటం ఒక కారణం. పూర్వ ప్రాథమిక విద్యకు సంబంధించిన అంగన్వాడీ కేంద్రాలు కేవలం పిండి బడులుగా పాఠశాలకు దూరంగా కొనసాగడం, వాటిని స్థానిక పాఠశాలలకు అనుసంధానం చేస్తూ ప్రాథమిక విద్యను పరిపుష్టం చేయవలసి ఉన్నది. అరకొరగా ఇవి ఉన్నచోట కూడా విద్యార్థుల సంఖ్య లేకపోవడానికి మండల కేంద్రాల నుండి ఊర్లలోకి వచ్చే ప్రైవేటు పాఠశాలల బస్సులు పిల్లల్ని గద్దల్లా ఎత్తుకెళ్లడం కొనసాగుతున్నది. ఇందుకు పరిష్కారంగా ప్రైవేటు పాఠశాలలను నియంత్రించడం, ఏ గ్రామంలోని పిల్లలు ఆ గ్రామంలో చదువుకోవడానికి ప్రైవేటు బస్సులు, బడులు రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. గతంలో మన ఊరు- మనబడి పేర ఎంపికైన పాఠశాలలకు నిధులు కేటాయించి అమ్మ ఆదర్శ పాఠశాలలతో పాటుగా వాటిని ప్రభుత్వం ఆలోచిస్తున్న సెమీ రెసిడెన్షియల్‌గా మార్చవలసి ఉన్నది. అందుకు కొనసాగింపుగా బడికి వచ్చే పిల్లలకు ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్, మధ్యాహ్నం మంచి భోజనం, సాయంత్రం స్నాక్స్ ఇవ్వడం గూర్చి ఆలోచించాలి. గతంలో నెలకొల్పిన మోడల్ స్కూల్స్ రెసిడెన్షియల్ గురుకుల పాఠశాలలు విద్యారంగాన్ని మరోవైపు నెట్టివేశాయి. అట్లాంటి ప్రయత్నమే 25 ఎకరాలలో అన్ని హంగులతో ప్రభుత్వం నెలకొల్పుతున్నట్లు చెబుతున్న బడులకంటే ఇప్పటికే ఉన్న పాఠశాలలను అన్ని హంగులతో బలోపేతం చేయడం విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుంది.

## తెలంగాణ క్యాపిటల్ న్యూస్‌కి స్పందించిన

# ఎమ్మెల్యే సత్యం

- రెండు రోజుల్లో నష్టపరిహారం అందిస్తాం
- బ్రిడ్జిని అతి త్వరలో ప్రారంభించి వాహనదారుల అవస్థలు తీరుస్తాం
- చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం





**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** ఈ వంతెన అలంకారప్రాయమైన అనే కథనం బుధవారం ప్రచురితం కాగా చిట్టి కథనానికి చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్యే బుధవారం రామడుగు వాగుపై కొత్తగా నిర్మించిన బ్రిడ్జిని కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో నాలుగు మండలాల రాకపోకలకు నిలయంగా మారిన రామడుగు బ్రిడ్జి నిర్లక్ష్యానికి గురైందని మండల అధికారులతో బ్రిడ్జి భూనిర్వాసిత రైతులతో మాట్లాడి రెండు మూడు రోజుల్లో సమస్య పరిష్కరించి రావలసిన పరిహారం వెంటనే చెల్లించే విధంగా చర్య తీసుకుంటూ రాకపోకలకు ఇబ్బందులు లేకుండా తక్షణమే నూతన బ్రిడ్జిపై నుంచి ప్రజలందరికీ వెసులుబాటు అయ్యే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల ఎమ్మార్వో వెంకటలక్ష్మి, ఎంపీడీవో రాజేశ్వరి, కాంగ్రెస్ జిల్లా బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, రామడుగు మాజీ ఎంపీపీ జవాజి హరీష్, వెలిచాల మాజీ సర్పంచ్ వీర్ల నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పంజాల శ్రీనివాస్ గౌడ్, ఆడెపు రంగన్న, ములుగు రాజశేఖర్ గౌడ్, తడగొండ హనుమంతు, నర్సింగ్ బాబు, మామిడాల నాగరాజు, బాపురాజ్, తడగొండ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ తీగలను తొలగించండి మహాప్రభో

- డిడి కట్టించుకున్నారు విద్యుత్ తీగలను తొలగించరేం....?



**తెలంగాణ క్యాపిటల్ న్యూస్, రామడుగు:** మా ఇంటి పై ఉన్న విద్యుత్ తీగలని తొలగించండి మహాప్రభో అంటూ రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామంలోని పదో వార్డులో నివాసం ఉంటున్న నాగసముద్రం స్వామి విద్యుత్ అధికారులకు మొరపెట్టుకుంటున్నాడు. స్వామి రేకుల షెడ్డుపై నుండి విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని, విద్యుత్తు తీగలను తొలగించాలని 2023 మే19 గుండి విద్యుత్ శాఖ ఏఈకి దరఖాస్తు చేసుకున్నానని, విద్యుత్ అధికారులు ఎస్టిమేషన్ వేసిన అనంతరం 2024 ఫిబ్రవరి 12న డిడి చెల్లించానని, డబ్బులు కట్టించుకొని ఆరు నెలలు గడిచినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు నేటికీ విద్యుత్ తీగలను తొలగించడం లేదని వాపోతున్నాడు. వర్షాకాల నేపథ్యంతో ప్రమాదం జరిగే అవకాశం ఉన్నదని ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ తీగలను తోలగించాలని పత్రిక ముఖముగా వెడుకోంటున్నాడు.

# రూమర్స్‌కు చెక్ పెట్టిన అభిషేక్....!



బాలీవుడ్ సినీ పరిశ్రమలో మోస్ట్ బ్యూటిఫుల్ జంటగా గుర్తింపు తెచ్చుకున్న అభిషేక్ బచ్చన్ – ఐశ్వర్యరాయ్ తెర మీదనే కాకుండా తెర బయట కూడా చూడముచ్చటగా ఉంటుంది. 2007లో వీరిద్దరూ ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి ఆరాధ్య అనే అమ్మాయి కూడా జన్మించింది. అలా 16 సంవత్సరాలు సంతోషంగా సాగిన కాపురంలో గత కొంతకాలంగా విభేదాలు చోటు చేసుకున్నాయనే వార్తలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా అభిషేక్ బచ్చన్ – ఐశ్వర్యారాయ్ విడాకులు తీసుకున్నారంటూ బాలీవుడ్ మీడియాలో కథనాలు కూడా వెలువడిన విషయం తెలిసిందే. దీనికి తోడు అన్ని మీడియా ఛానల్స్ లో కూడా ఈ వార్తలు జోరుగా వినిపించాయి.ఇక ఈ వార్తలు ఇప్పుడు వీరి వరకు చేరడంతో అసహనం కోల్పోయిన అభిషేక్ బచ్చన్ ఒక్కసారిగా ఆగ్రహం వ్యక్తం చేస్తూ పలు ఘాటు వ్యాఖ్యలు చేశారు అవును విడాకులు నిజమే.. ఆ తర్వాత మేము చేసుకోబోయే పెళ్లి గురించి కూడా మీరే చెప్పండి.. అంటూ అసహనం వ్యక్తం చేశారు. నాకు, ఐశ్వర్య కు జీవితంలో ఎలా ఉండాలో తెలుసు.. ఒకరి పైన ఒకరికి ఎంత ప్రేమ ఉందో మాకు తెలుసు.. మీరు వచ్చి మా మధ్య ఇలాంటి విభేదాలు సృష్టించాల్సిన అవసరం లేదు. అసలు పుకార్లకు మేము చోటు ఇవ్వము అంటూ కూడా ఆయన చెప్పుకొచ్చారు.

అంతేకాదు తమ జీవితంలో మూడో వ్యక్తి వచ్చి ఇలా మాట్లాడాల్సిన అవసరం లేదు అంటూ కూడా ఆయన తెలిపారు. మొత్తానికి అయితే విడాకులపై వస్తున్న రూమర్లకు స్పందించిన అభిషేక్ బచ్చన్ వాటికి చెక్ పెట్టారు. ఇకనైనా ఈ రూమర్లు ఆగిపోతాయేమో చూడాలి. అయితే గత కొద్ది రోజులుగా అభిషేక్ బచ్చన్, ఐశ్వర్యరాయ్ ఇద్దరు కలసి కనిపించిన దాఖలాలు లేవు. పైగా అనంత్ అంబానీ పెళ్లిలో కూడా ఎవరికి వారు విడిగా కనిపించారు. దీంతో ఈ రూమర్లకు మరింత బలం చేకూరింది. కానీ ఇప్పుడు అభిషేక్ బచ్చన్ స్పందించేసరికి ఈ రూమర్స్ కి కాస్త చెక్ పడినట్లు తెలుస్తోంది.

## వారం రోజుల్లోనే పెళ్లి చేసుకున్న రానా..?



దగ్గుబాటి రామానాయుడు మనవడు రానా లీడర్ మూవీ తో ఇండస్ట్రీ లోకి హీరోగా రంగ ప్రవేశం చేశారు. అయితే ఈయన కేవలం హీరో మాత్రమే కాదు విజువల్ ఎఫెక్ట్ సమన్వయకర్తగా పనిచేసే విలన్ గా కూడా చాలా సినిమాల్లో మెప్పించారు.బాహుబలి వంటి పాన్ ఇండియా మూవీలో హీరోకి ఏమాత్రం తీసిపోని విలన్ పాత్రలో నటించి స్టార్ స్టేటస్ సంపాదించారు. అలాగే రానా నాయుడు వెబ్ సిరీస్ ద్వారా రానా పేరు మరింత ఫేమస్ అయ్యారు. అయితే అలాంటి రానా సినీ కెరీర్ బాగున్నప్పటికీ పర్సనల్ కెరియర్ లో మాత్రం ఎన్నో వివాదాలు చుట్టుముట్టాయి. ఈయన ఇండస్ట్రీలో ఉన్న కొంతమంది అమ్మాయిలతో డేటింగ్ చేయడంతో ఈయన పేరు ఎప్పుడు మీడియాలో వైరల్ గానే ఉండేది.. డేటింగ్ వార్తలన్నింటికి చెక్ పెడుతూ మిహికా బజాజ్ ని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అయితే రానా మిహికల పెళ్లి చాలా వెరైటీగా జరిగిందట. వీరిద్దరూ పరిచయమైన వారం రోజుల్లోనే పెళ్లి చేసుకున్నారట. మరి వీరి లవ్ స్టోరీ ఏంటి.. వారం రోజుల్లో పెళ్లి ఎలా జరిగింది అనేది ఇప్పుడు చూద్దాం.దగ్గుబాటి రానా,మిహికా బజాజ్ ల పెళ్లికరోనా సమయంలో చాలా సింపుల్ గా జరిగింది.. అయితే కరోనా సమయంలో నితిన్, నిఖిల్ వంటి హీరోల పెళ్లిళ్లు కూడా జరిగాయి. కరోనా సమయంలో లాక్ డౌన్ కారణంగా చాలామంది ఇంటి పట్టునే ఉన్నారు. ఇక ఇదే సమయంలో రానా హౌజ్ పార్టీ అనే ఒక యాప్ ని డౌన్లోడ్ చేసుకొని కొద్దిరోజులు యూస్ చేశారట.

అలా ఆ యాప్ వాడినా కొద్ది రోజుల్లోనే ఓ అమ్మాయిని ఆ యాప్ ద్వారా కలిసాడట. ఆమె ఎవరో కాదు మిహికా బజాజ్..అయితే ఈ యాప్ ద్వారా ఎంతో మందిని మీట్ అవచ్చు. మీట్ అవ్వడమే కాదు మనకు తెలిసినవారిని ఆ యాప్ లో యాడ్ చేయవచ్చుట. అలా చాలా సంవత్సరాల కింద చూసిన ఒక అమ్మాయి ఆ యాప్ లో కనిపించింది. ఇక ఆ అమ్మాయి మిహికా బజాజ్..అలా వీరిద్దరూ ఆ యాప్ ద్వారా కలుసుకొని వారం రోజుల్లోనే పెళ్లి చేసుకుంటాను అని మ్యారేజ్ ప్రపోజల్ రానా మిహికా బజాజ్ ముందు పెట్టారట.అయితే కలిసిన వారానికే పెళ్లి ఏంటి అని మిహికా మొదట్లో షాక్ అయిందట.

## డబుల్ ఎంటర్‌టైన్‌మెంట్...



రామ్ పోతినేని, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబోలో రూపొందిన పాన్ ఇండియా మూవీ 'డబుల్ ఇస్మార్ట్'. పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మించిన ఈ సినిమాలో రామ్ పోతినేనికి జోడీగా కావ్య థాపర్ నటించింది. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈనెల 15న ఈ సినిమా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

ఈ నేపథ్యంలో వరంగల్‌లో 'డబుల్ ఇస్మార్ట్' ప్రీరిలీజ్ ఈవెంట్ చాలా గ్రాండ్‌గా జరిగింది. రామ్ మాట్లాడుతూ, "ఇస్మార్ట్ శంకర్' ప్రీరిలీజ్ ఈవెంట్‌కి ఇక్కడికి వచ్చాం. మళ్ళీ 'డబుల్ ఇస్మార్ట్' ఈవెంట్‌కి ఇక్కడి రావడం చాలా హ్యాపీగా ఉంది. మణిశర్మ అద్భుతమైన ఆల్బం ఇచ్చారు. స్క్రీన్ మీద చూశాక పాటలు ఇంకా నెక్స్ట్ లెవల్‌కి వెళ్తాయి. సంజయ్ దత్‌తో కలిసి పని చేయడం ఆనందంగా ఉంది. కావ్య చాలా హార్డ్ వర్క్ చేసింది. విష్ హానెస్ట్‌గా తన పని తను చేస్తూ ఉంటాడు . చార్మి ఫైటర్. ఆమె లేకుండా ఈ సినిమా పాజిబుల్ అయ్యేది కాదు. పూరితో పని చేసినప్పుడు వచ్చే కిక్ నెక్స్ట్ లెవల్‌లో ఉంటుంది' అని తెలిపారు. "డబుల్ ఇస్మార్ట్' గురించి మాట్లాడాలంటే ఒకే ఒక పేరు..

రామ్ పోతినేని. ఇస్మార్ట్ శంకర్, డబుల్ ఇస్మార్ట్‌కి రామ్ ఎనర్జీ మామూలుగా లేదు. సంజు బాబాకి నేను పెద్ద ఫ్యాన్‌ని. 150 సినిమాల హీరో ఆయన. ఆయన ఈ సినిమాలో చేయడం కొత్త కలర్ తీసుకొచ్చింది. రచయిత విజయేంద్ర ప్రసాద్ కథ గురించి చేసిన ఫోన్ కాల్‌తో నేను చాలా ఎమోషనల్ అయిపోయాను. నామీద ఆయనకి ఉన్న ప్రేమ, అభిమానంతో చేశారు.

## సంధ్యారాజుకు అరుదైన గౌరవం...



ప్రఖ్యాత కూచిపూడి నృత్యకారిణి, విమర్శకుల ప్రశంసలు అందుకున్న తెలుగు నటి సంధ్యారాజుకు అరుదైన గౌరవం దక్కింది. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఆహ్వానం అందింది. 77వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఢిల్లీలోని రాష్ట్రపతి భవనంలో నిర్వహించే 'ఎట్ హోమ్ రిసెప్షన్' సెలబ్రేషన్స్‌కి ఆహ్వానిస్తూ లేఖ అందింది. తన తొలి చిత్రం 'నాట్యం'తో రెండు జాతీయ పురస్కారాలను దక్కించుకున్న ఘనత సంధ్యారాజుకు సొంతం.


తమిళనాడుకి చెందిన వ్యాపారవేత్త, రామ్‌కో గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ పి.ఆర్.వెంకట్రామరాజా పుత్రిక సంధ్యారాజు. హైదరాబాద్‌లో నిశ్శంఖల డ్యాన్స్ అకాడమీ, నిశ్శంఖల ఫిల్మ్ ఫౌండర్‌గా అనేక కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. తన నృత్య కళతో ప్రపంచ యవనిక పై అసమానమైన ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తున్నారు సంధ్యారాజు. ప్రత్యక్ష నృత్య ప్రసారాల్లో పాల్గొనడమే కాదు, చలనచిత్ర రంగంలోనూ తనదైన ముద్రతో రాణిస్తున్నారు. నటిగా, క్లాసికల్ డ్యాన్సర్‌గా, జాతీయ పురస్కారాన్ని అందుకున్న కొరియోగ్రాఫర్‌గా, నిర్మాతగా.. భారతీయ సాంస్కృతిక రంగంలో ఎంతో మందికి స్ఫూర్తి పంచుతున్నారామె. 'ఎట్ హోమ్ రిసెప్షన్'ని ఈనెల 15 సాయంత్రం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో నిర్వహిస్తారు. 15న ఉదయం జెండా వందనం పూర్తవగానే సాయంత్రం ఈ వేడుకను రాష్ట్రపతి ఆధ్వర్యంలో నిర్వహిస్తారు.

## అవకాశాలు అంత సులువుగా రాలే......!



ప్రస్తుతం పాన్ ఇండియా స్థాయిలో అగ్ర కథానాయికగా చలామణి అవుతున్నది కన్నడ సోయగం రష్మిక మందన్న. తెలుగు, హిందీ భాషల్లో భారీ చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది. అయితే తాను ఈ స్థాయికి చేరుకోవడానికి ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నానని, కెరీర్ తొలినాళ్లలో అవకాశాలు అంత సులభంగా రాలేదని చెప్పింది రష్మిక. ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ తొలినాటి కష్టాల గురించి చెప్పుకొచ్చిందీ భామ. ఆమె మాట్లాడుతూ 'ఆడిషన్స్‌కు వెళ్లిన ప్రతీసారి తిరస్కారాలు ఎదురయ్యేవి. కొందరైతే నేను నటిగా సక్సెస్ కావడం చాలా కష్టమని మాట్లాడేవారు. అవకాశాలు రావనే దిగులుతో కన్నీళ్లతో ఇంటికి వచ్చిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఓ సినిమా సెలెక్ట్ చేసిన తర్వాత మూడు నెలల పాటు వర్క్‌షాప్ నిర్వహించారు. ఆ తర్వాత ఈ ప్రాజెక్ట్‌ను క్యాన్సిల్ చేశారు.

## పట్నం పిల్ల వచ్చేసింది..



'హుషారు' వంటి వైవిధ్యమైన చిత్రంతో ప్రేక్షకులను మెప్పించిన యువ కథానాయకుడు తేజస్ కంచర్ల తాజాగా నటిస్తున్న చిత్రం 'ఉరుకు పటేల'. 'గెట్ ఉరికిఫైడ్' అనేది సినిమా ట్యాగ్ లైన్. సెప్టెంబర్ 13న సినిమా గ్రాండ్ రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో సోమవారం ఈ మూవీ నుంచి 'పట్నం పిల్ల..' అనే సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇది గ్రామీణ నేపథ్యంలో భావోద్వేగాల ప్రధానంగా సాగే చిత్రం. హీరోయిన్ పట్నం నుంచి సెలవులకు పల్లెటూరుకి వస్తుంది. అక్కడ హీరో ఆమెను చూసి మనసు పారేసుకుంటాడు. తన మనసులోని ప్రేమలో తెలియజేసేందు తను పడే పాట్లు, మనసులోని భావాలను వ్యక్తం చేసే పాట అని అర్థమవుతుంది. ఈ చిత్రానికి ప్రవీణ్ లక్కరాజు సంగీతం అందిస్తున్నారు. ఈ పాటను కాసర్ల శ్యామ్ రాయగా, రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. లీడ్ ఎడ్జ్ పిక్చర్స్ బ్యానర్‌పై వివేక్ రెడ్డి దర్శకత్వంలో కంచర్ల బాల భాను ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సన్నీ కూరపాటి సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.

## 'డాన్' షారుక్ కాదు హృతిక్...



'డాన్'.. ఈ పేరు వింటేనే సినీప్రియుల మదిలో మెదిలే కథానాయకులు అమితాబ్ బచ్చన్, షారుక్ ఖాన్. 'డాన్', 'డాన్ 2' సినిమాలు షారుక్‌ని తెరపై మరింత స్టైలిష్‌గా ఆవిష్కరించాయి.కానీ ఫర్హాన్ అక్తర్ తెరకెక్కించిన ఈ చిత్రాల్లో హృతిక్ రోషన్ పోషించాల్సిన 'డాన్' పాత్రలో షారుక్ నటించారంటే నమ్ముతారా..? అవును.. ఇది నిజమే అంటున్నారు దర్శకుడు ఫర్హాన్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన..హృతిక్‌తో 'డాన్' చిత్రం గురించి చర్చించిన రోజుల్ని గుర్తు చేసుకున్నారు.